క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నర్మెట: మండలానికి చెందిన 23 మంది పలు కారణాలతో అనారోగ్యానికి గురికాగా చికిత్స నిమిత్తం మంజూరైన రూ.6.79 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గద్దల నర్సింగారావు, మండల అధ్యక్షుడు సురేష్, కోఆర్డినేటర్ నీరటి సుధాకర్, మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, మాజీ జెడ్పీ కోఆప్షన్ ఎండీ గౌస్, వెంకట రమణారెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు..



జనగామ రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీడీసీ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాపారవేత్త గజ్జి మధు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సునంద, సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



జనగామ: జిల్లా ఎస్‌టీయూ 2025 డైరీని ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఏర్పడిన మొట్టమొదటి సంఘం ఎస్‌టీయూ అని అన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆట సదయ్య, సుధాకర్‌రెడ్డి, రవి, జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి నర్సింహయ్య పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ప్రగతి ప్రస్థాన సంచిక..



విశ్వహిందూ పరిషత్ ఆరు దశాబ్దాల ప్రగతి ప్రస్థాన ప్రత్యేక సంచికను శుక్రవారం జిల్లా కేంద్రం సిద్దిపేట రోడ్డులోని గీతాశ్రమంలో ఆవిష్కరించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్, ధర్మరక్ష బ్రహ్మానందం, ప్రముఖ్ నర్సింగరావు, నరహరి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



లింగాలఘణపురం: హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిలో నెల్లుట్ల ఫ్లై వర్ బ్రిడ్జి కింద శుక్రవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం వద్ద ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆర్‌టీసీ కాలనీకి చెందిన ఎస్.స్వరూప ఫ్లై ఓవర్ కింది నుంచి రోడ్డు దాటుతుండగా బైక్‌పై వస్తున్న రాజ్‌కుమార్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అప్పుడే అక్కడికి కారులో వచ్చిన ఎమ్మెల్యే గమనించి వెళ్లి వివరాలు తెలుసుకుని 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. గాయాలైన స్వరూపను జనగామ ఏరియా ఆస్పత్రికి పంపించి ఫోన్‌లో వైద్యులతో మాట్లాడి తక్షణమే చికిత్స అందించాలని సూచించారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

కొడకండ్ల: నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు పాడి పంటలతో ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో నాయకులు క్యాంపు కార్యాలయంలో వారిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త స్తంభం ఏర్పాటు చేస్తాం

● విద్యుత్ ఏఈ రాజ్‌కుమార్

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామంలో షాక్ కొడుతున్న విద్యుత్ స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ స్తంభం 'ముట్టుకుంటే షాక్' శీర్షికన సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. శనివారం ఆయన మాట్లాడుతూ మసీదు ప్రాంతం మొత్తం బండ ఉండడంతో గుంత పడటంలేదని, కంప్రెషర్ మిషన్ తీసుకొచ్చి గుంత వేసి సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.


శిథిలావస్థలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు

● ఆందోళనలో స్థానికులు
● పట్టించుకోని అధికారులు

రఘునాథపల్లి: దశాబ్దాల క్రితం అశ్వరావుపల్లిలో నిర్మించిన 90 వేల లీటర్ల ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. గ్రామ ఆయుర్వేద ఆస్పత్రి వద్ద ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంకు పెచ్చులూడుతోంది. ఓ పిల్లర్ కింది భాగం శిథిలం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం మిషన్ భగీరథలో ఈ శిథిల ట్యాంకుకు రంగులు వేసి వదిలేశారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు ప్రమాదకరంగా ఉందని మిషన్ భగీరథ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు స్థానంలో కొత్తది నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



శిథిలమైన ట్యాంకు పిల్లర్



శిథిలావస్థలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు

ఆర్‌యూబీ నిర్మాణ పనుల పరిశీలన



రైల్వే కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రఘునాథపల్లి: నిడిగొండ రైల్వే ట్రాక్ వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు. రైల్వే ట్రాక్ వద్ద ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, మాధారం వెళ్లే వైపు ఆర్‌యూబీ 33 ఫీట్ల వెడల్పుతో పనులు చేపడుతుండగా.. నిడిగొండ వైపు కేవలం 21 ఫీట్ల వెడల్పుతోనే నిర్మిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు, అయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం కడియం పార్టీ నాయకులతో కలిసి ఆర్‌యూబీ పనులు పరిశీలించి రైల్వే కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. ఫతేషాపూర్ వైపు 33 ఫీట్ల వెడల్పు ఉందని, నిడిగొండ వైపు 21 ఫీట్లు తక్కువ వెడల్పు ఉందని వివరించారు. శాశ్వతంగా ఉండే ఆర్‌యూబీని అశాస్త్రీయంగా నిర్మించడం వల్ల అండర్‌గ్రౌండ్ నుంచి ఒకే వాహనం వెళ్లే అవకాశాలు ఉంటుందని, దీంతో ఇబ్బందులు వస్తాయని, ఆర్‌యూబీతో ఎలాంటి ప్రయోజనం కూడా ఉండదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలో భూయజమానులను తన వద్దకు తీసుకురావాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. అధికారులతో కలిసి వారితో చర్చించి అవసరమైతే తాను వ్యక్తిగతంగా భూయజమానులకు పరిహారం ఇస్తానని ఎమ్మెల్యే చెప్పారు. గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొడకండ్ల: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ. 4వేల కోట్ల బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థి సంక్షేమానికి చేయూతనివ్వాలని బీసీ సంక్షేమ యువజన సంఘం మండల అధ్యక్షుడు సున్నపోజు విశ్వాస్ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం పిలుపు మేరకు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం తహసీల్దార్ చంద్రమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. కళాశాల విద్యార్థులకు ఏడాదికి రూ. 20 వేల స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పర్శరాం, శివమణి, అరుణ్, సోహెల్, సిద్ధూ, వినయ్, శ్రావణ్, ప్రశాంత్, అజయ్ ఉన్నారు.

ఎమ్మెల్యే శ్రీహరిని విమర్శిస్తే సహించం

● యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దిలీప్‌రెడ్డి



మాట్లాడుతున్న దిలీప్‌రెడ్డి

లింగాలఘణపురం: అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఎవరైనా విమర్శిస్తే కాంగ్రెస్ కార్యకర్తలు సహించబోరని, గ్రామాల్లో తిరుగనీయమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కీసర దిలీప్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని నెల్లుట్లలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, జనగామ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరి నర్సింహులు, మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్టానం సీనియర్ నాయకుడు, అనుభవం ఉన్ననేతగా ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్ పార్టీలోనికి ఆహ్వానించిందని, అదేవిధంగా అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యులై నియోజకవర్గానికి రూ. కోట్ల నిధులు తెస్తూ అభివృద్ధి చేస్తున్నారని, ఆ అభివృద్ధి కనిపించడంలేదా అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రజలు చీదరించినప్పటికీ కొందరు నాయకులు శ్రీహరిపై నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని కోరారు. మార్కెట్ డైరెక్టర్ మోహన్, దేవస్థాన చైర్మన్ మూర్తి, నాగరాజు, అనిల్, సంపత్, శ్రీనివాసురెడ్డి, ఆంజనేయులు, రాజు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం అందజేత



సావిత్రిబాయి జయంతి వేడుకల్లో రాజు

తరిగొప్పుల: మండలంలోని బొత్తలపర్రె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. కాగా, శుక్రవారం సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్, పాఠశాలకు రంగులు వేయడానికి గ్రామానికి చెందిన రైస్‌మిల్ యాజమాని సిద్ధి రాజు రూ.30 వేల విరాళాన్ని హెచ్‌ఎం సంపత్‌కు అందజేశారు. ఎంపీఓ మాలతి, మాధవి, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్డీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఆర్డీఓ వెంకన్న తదితరులు



జనగామ రూరల్: పెంబర్తిలో నివాళులర్పిస్తున్న హైకోర్టు న్యాయవాది సాధిక్ అలీ తదితరులు



లింగాలఘణపురం: పాఠశాలకు వితరణ చేసిన దినపత్రికలతో జైభీమ్ ఫౌండేషన్ సభ్యులు

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

● ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి

ప్రతి ఒక్కరూ మహనీయులను ఆదర్శంగా తీసుకుని ఎదగాలని వక్తలు కోరారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో దేశ తొలి ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలు సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



జనగామ రూరల్: ఆర్టీసీ డిపోలో..



పాలకుర్తి టౌన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



నర్మెట: మోడల్ స్కూల్‌లో..



జనగామ: సేయింట్స్ పాల్స్ పాఠశాలలో..



చిల్పూరు: చిన్నపెండ్యాలలో..



కొడకండ్ల: అంగన్‌వాడీలో..



దేవరుప్పుల: ప్రశాంతి విద్యానికేతన్‌లో..



రఘునాథపల్లి: నివాళులర్పిస్తున్న మాదిగ లాయర్ల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు రత్నం



బచ్చన్నపేటలో.. ఎమ్మార్పీఎస్ నాయకులు



జఫర్‌గఢ్: జూనియర్ కళాశాలలో..

సంక్షిప్త సమాచారం

సోషల్ ఆడిట్‌కు సహకరించాలి

కొడకండ్ల: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులపై నిర్వహించే సోషల్ ఆడిట్‌కు సహకరించాలని ఎస్ఆర్పీ గంగరాజు కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి అధ్యక్షతన నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9వ తేదీ వరకు మండలంలో అన్ని గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించి గ్రామ సభలు నిర్వహించి నివేదికలు ప్రజల ముందు ఉంచడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ బృందాలకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఏపీఓ కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కుంకుమ పూజ

జఫర్‌గఢ్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కూనూర్ గ్రామంలో గోదారంగనాథ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో మహాలక్ష్మి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రవచన బోధకులు ఆగమశాస్త్ర బ్రహ్మశ్రీ జనార్ధనాచార్యుల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శబరిమలకు తరలిన మాలధారులు

జఫర్‌గఢ్: మండల కేంద్రం నుంచి అయ్యప్ప మాలధారులు శబరిమలకు శుక్రవారం తరలివెళ్లారు. 40 రోజులు భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించి ఇరుముడులు కట్టుకుని పురవీధులగుండా ఊరేగింపుగా బయలుదేరారు. అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొడకండ్ల: మండలంలోని కొడకండ్ల, రేగుల, రేగులతండాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో నాయకులు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, యాకయ్య, అమరేందర్‌రెడ్డి, నసీరుద్దీన్, యాకేష్, రవీందర్ తదితరులు ఉన్నారు.

కడవెండిలో..

దేవరుప్పుల: మండలంలోని కడవెండిలో రేషన్ డీలర్ బూడిది శ్రీను తండ్రి రాందయాల్ మృతి చెందాడు. కాగా, ఆయన మృతదేహానికి బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేషమ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. హనుమంతు, తాటిపెల్లి మహేష్, దుబ్బాక కవిత రత్నాకర్ రెడి, రోపేల్‌రెడ్డి, నగేష్, పెద్ది రవీందర్, భాషిపాక అంజయ్య, కోల యాదగిరి, అంజిరెడ్డి ఉన్నారు.

బండనాగారంలో..



బచ్చన్నపేట: మండలంలోని బండనాగారంలో బాసరాజు అంజయ్య మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను గ్రామ నాయకుడు నల్ల సంజీవరెడ్డి పరామర్శించి రూ.15వేల సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ చల్ల సుధాకర్‌రెడ్డి, ఇజ్జగిరి రాములు, చల్ల ప్రభాకర్‌రెడ్డి, నల్ల గోపాల్‌రెడ్డి ఉన్నారు.

ఎంపిక



భూపాల్‌రెడ్డి

నర్మెట: కాంగ్రెస్ పార్టీ మండల సలహాదారుడిగా వెల్దండకు చెందిన సీనియర్ నాయకుడు వంగ భూపాల్‌రెడ్డి శుక్రవారం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రదాత సోనియాగాంధీ సారథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తుందన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో బాధ్యలు అప్పగించిన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి, సహకరించిన ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డికి, మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం



రజాక్‌యాదవ్

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యూత్ అధ్యక్షుడిగా మండలంలోని నమిలిగొండ గ్రామానికి చెందిన పురమాని రజాక్‌యాదవ్ నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని నాగోల్‌లో నిర్వహించిన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లా యూత్ అధ్యక్షుడిగా రజాక్‌యాదవ్‌ను నియమించినట్లు యాదవ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్, జిల్లా అధ్యక్షుడు సిద్దిరాజ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రజాక్‌యాదవ్ శుక్రవారం ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. తనపై విశ్వాసంతో జిల్లా యూత్ అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నాయకుల ఆదేశాలు, సూచనల మేరకు యాదవుల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

గురుకులాలపై శ్రద్ధ చూపాలి

జనగామ రూరల్: గురుకులాల్లో మౌలిక వసతులు, భోజన సదుపాయాలపై శ్రద్ధ చూపాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్ సాయి కోరారు. ఈ మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌కు వినతి అందజేశారు. మహేందర్, ఉమర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీడీసీఎల్ డీఈని కలిసిన ఉద్యోగులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని ఎన్పీడీసీఎల్ డీఈ కార్యాలయంలో బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో డీఈ వై.రాంబాబును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఈకి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ నాగవెల్లి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జి.రాంబాబు, కార్యదర్శి రాజేష్, ఘన్‌పూర్ డివిజన్ కార్యదర్శి శ్రీధర్‌పటేల్ తదితరులు ఉన్నారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో శుక్రవారం 11 గంటల ప్రాంతంలో వేగంగా వెళ్తున్న రైలు దిగబోయి ఒకరు మృతి చెందారు. జనగామ రైల్వే జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ అందించిన వివరాలు.. వరంగల్ చార్‌బౌలికి చెందిన మొహ్మద్ అలీముద్దీన్ (59) నిద్రమత్తులో స్టేషన్ వచ్చిందనుకుని నడుస్తున్న రైలు దిగబోయి కింద పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాంనూర్ గ్రామానికి చెందిన బత్తిని తిరుపతి(50) గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో శుక్రవారం మృతిచెందాడు. వివరాలు.. పాంనూర్‌కు చెందిన తిరుపతి గీత వృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల ఆరోగ్య పరిస్థితులు బాగా లేకపోవడంతో అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక గురువారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్నాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు శశికాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నన్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

రోకలిబండపై పడి వృద్ధురాలి..

జఫర్‌గఢ్: హై బీపీతో రోకలిబండపై పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని ఓబులాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని వ్యవసాయ పొలం వద్ద గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రామ్‌చరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయపర్తి మండలం కేశవాపురం జీపీ పరిధి జగ్యతండాకు చెందిన భూక్య దేవమ్మ (60) భర్తతో కలిసి ఓబులాపూర్ రెవెన్యూ పరిధిలోని పొలం వద్ద రేకుల షెడ్డు వేసుకుని నివాసం ఉంటోంది. కొద్ది రోజుల నుంచి దేవమ్మ హై బీపీ, షుగర్, పక్షవాతంతో బాధపడుతోంది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా హైబీపీ వచ్చి రోకలిబండపై దేవమ్మ పడటంతో తలకు తీవ్రగాయమైంది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందిందని ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం శవపంచానమ నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామ సమీపంలోని రైస్ మిల్లు వద్ద బైక్‌ను లారీ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 108 పైలట్ అమర్‌నాథ్, ఈఎస్‌టీ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు.. అబ్దుల్‌నారానికి చెందిన రాజేంద్రప్రసాద్ ద్విచక్ర వాహనంపై తల్లి రాజమ్మతో చిన్నపెండ్యాల వైపునకు వస్తున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో చికిత్స నిమిత్తం క్షతగాత్రులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఫత్తేపూర్ గ్రామానికి చెందిన గుగులోత్ రాజేష్ కుటుంబ కలహాలతో శుక్రవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాగా, వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

వృద్ధుడి అదృశ్యం



లక్ష్మయ్య

నర్మెట: వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని గండిరామారంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన గోవిందుల లక్ష్మయ్య(60) హైదరాబాద్‌లోని కూతురు కల్పన వద్దకు వెళ్తున్నాని చెప్పి బుధవారం వెళ్లాడు. మరుసటి రోజు ఆరాతీయగా తండ్రి రాలేదని సోదరి తెలుపడంతో లక్ష్మయ్య కుమారుడు యాదగిరి శుక్రవారం నర్మెట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, లక్ష్మయ్య భార్య సరోజన గత మూడు మాసాల క్రితం మరణించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు.

'ఎల్టా'లో విద్యార్థుల ప్రతిభ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎల్టాలో ప్రతిభ కనబరిచి జిల్లాకు ఎంపికై నట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమేశ్ శుక్రవారం తెలిపారు. పాఠశాలలో ఎల్టా (ఇంగ్లిష్ ల్యాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంగ్లిష్ ఉపన్యాసంలో పోటీలు నిర్వహించారు. కాగా, పాఠశాలకు చెందిన విద్యార్థులు సిరిచందన, కె.చందన, ధనశ్రీలు జిల్లాకు ఎంపికయ్యారు. రెండో ర్యాంక్‌లో ఖిలాషాపూర్ పాఠశాలకు చెందిన ఎస్‌కే.లీల ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్టా ఆర్గనైజర్ నాగభూషణం, శ్రీనివాస్‌రెడ్డి, నర్సయ్య, శ్రీలత‌లు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటాలి



జఫర్‌గఢ్: టాలెంట్ టెస్టుల్లో విద్యార్థులు ప్రతిభను కనబర్చాలని మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం పద్మ కోరారు. ఎల్టా ఆధ్వర్యంలో ఆ పాఠశాలలో విద్యార్థులకు టాలెంట్‌టెస్ట్‌ను శుక్రవారం నిర్వహించారు. పసునూరి శ్రావ్య, జి.లావణ్య ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు. దామెర ఉపేందర్, శ్రవణ్‌కుమార్, వేణుగోపాల్, రమేష్‌బాబు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్ ఎల్టా ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. జి.సిరిచందన, వై.రనిత, పి.ఆశారాణి, డి.మానస ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. వీరిని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఓరుగంటి రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు జత్తు, శోభ, స్వామి, సోమాని నాయక, విద్యార్థులు పాల్గొన్నారు.

పొలాలకు నీరందించండి

జఫర్‌గఢ్: ధంసా ఫీడర్ చానల్ ద్వారా రైతుల పంట పొలాలకు సాగునీరందించాలని కోరుతూ ఉప్పుగల్లు రైతులు మాజీ వైస్ ఎంపీపీ కొదారి కనకయ్య ఆధ్వర్యంలో హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీంతో పాటు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెలే దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు లెంకల రాజు, రైతులు పాల్గొన్నారు.